# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 173 9-7-2026 వెల: రూ.2/- పేజీలు: 06









## ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారత సాంస్కృతిక వారసత్వం

- ప్రధాని మోదీ స్పష్టీకరణ
- ఇండోనేసియాలో ప్రంబనన్ ఆలయ సందర్శన
- ఇది భారత్, ఇండోనేసియాల నాగరికతా బంధాలకు నిదర్శనమని వెల్లడి
- ఆలయ పరిరక్షణ ప్రాజెక్టు ప్రారంభం

యోగ్యకార్తా: ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతదేశ సాంస్కృతిక వారసత్వం కనిపిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. ఇండోనేసియాలోని యోగ్యకార్తాలో శతాబ్దాల చరిత్ర కలిగిన ప్రఖ్యాత ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని ఆయన బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మోదీ వెంట ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియంతో కూడా ఉన్నారు. యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడమైన ఈ ఆలయాన్ని ఉమ్మడిగా పరిరక్షించే ప్రాజెక్టును ఇరువురు నేతలు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని భారత్, ఇండోనేసియాల మధ్య చిరకాల నాగరికతా బంధాలకు ఒక అద్భుతమైన నిదర్శనంగా మోదీ అభివర్ణించారు. శతాబ్దాలుగా ఇరుదేశాల ప్రజలను అనుసంధానిస్తున్న ఉమ్మడి వారసత్వానికి ఇదొక గొప్ప ప్రతీక అని పేర్కొన్నారు. భారత్ సహాయంతో ఆలయ సముదాయ పరిరక్షణ, పునరుద్ధరణ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ఇరు దేశాలు మంగళవారం ఒక అంగీకారానికి వచ్చిన

### హాస్టళ్లు, గురుకుల విద్యార్థులకు

# 10 శాతం డైట్ ఛార్జీల పెంపు

- రూ.100 కోట్లతో హాస్టళ్లు, గురుకులాల మరమ్మతులు
- ప్రత్యేక కోచింగ్ కేంద్రాలు, మెరుగైన వసతులకు సీఎం ఆదేశం
- ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని సూచన
- పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలని కంపెనీలకు సీఎం ఆదేశం
- కనీస మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోళ్లు జరపాలని సూచన



ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారికి అందించే డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ పెంపును వచ్చే ఏడాది నుంచి అమలు చేయాలన్న ఆర్థిక శాఖ సూచనను సీఎం తిరస్కరించారు. ఈ ఏడాది రెండో త్రైమాసికం నుంచే పెంపు అమల్లోకి రావాలని స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్య ద్వారానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల జీవితాల్లో మార్పు వస్తుందని, అందుకే వారికి అన్ని విధాలా మెరుగైన అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ శాఖల సమీక్షలో ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. హాస్టళ్ల స్థానంలో మరిన్ని గురుకులాలు నిర్మించాలని, హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మత్తులకు రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.


- మిగతా 2వ పేజీలో


## 3 నెలలు మంత్రి పదవి ఇస్తే కాళేశ్వరం నీళ్లు తెచ్చి చూపిస్తా

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్
- విఫలమైతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని ప్రకటన
- తుమ్మిడిహట్టి ప్రాజెక్టులో కాంగ్రెస్ అవినీతికి పాల్పడిందని ఆరోపణ




2లో


## అహోబిలంలో పొలిటికల్ హైటెన్షన్

- భూమా అఖిలప్రియ వర్సెస్ గంగుల నాని
- ఆలయ తలనీలాల వ్యవహారంలో అఖిలప్రియకు ముడుపులు అందుతున్నాయన్న గంగుల నాని
- ఆరోపణలు నిరూపించాలంటూ అఖిలప్రియ సవాల్
- తాను చేసిన ప్రతి ఆరోపణకు కట్టుబడి ఉన్నానన్న గంగుల నాని




2లో


## 'మీరు ఇవ్వలేదు.. మేమే కొట్లాడి తెచ్చుకున్నాం'..

- తాడిచెర్ల-2పై భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు
- కొత్త కేటాయింపు కాదన్న డిప్యూటీ సీఎం
- 2013లోనే యూపీఏ సింగరేణికి కేటాయించిందని వెల్లడి
- మైనింగ్ లీజు అనుమతులు ఆలస్యమయ్యాయని విమర్శ
- అన్ని సింగరేణి గనులు సంస్థకే ఇవ్వాలని డిమాండ్


2లో





# తెలంగాణ-కెనడా భాగస్వామ్యానికి కొత్త ఊపు

- సీఎంతో కెనడా హైకమిషనర్ భేటీ
- పెట్టుబడులపై విస్తృత చర్చలు
- హరిత అభివృద్ధికి సహకారం
- మెట్రో, మూసీపై చర్చ
- కెనడా పర్యటనకు ఆహ్వానం
- రైజింగ్ సమ్మిట్‌కు ఆహ్వానం



హైదరాబాద్: తెలంగాణ--కెనడా మధ్య పెట్టుబడులు, వాణిజ్యం, ఆవిష్కరణల రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, భారత్‌లోని కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్ మధ్య విస్తృతంగా చర్చలు జరిగాయి. బుధవారం జరిగిన మర్యాదపూర్వక భేటీలో రాష్ట్ర అభివృద్ధి ప్రాధాన్యతలు, భవిష్యత్ సహకార అవకాశాలపై ఇరువురు అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్రంలో సౌర విద్యుదుత్పత్తి, హరిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కెనడా సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణను ప్రపంచస్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. కెనడాకు చెందిన విశ్వవిద్యాలయాలు కూడా హైదరాబాద్‌లో మల్టీ యూనివర్సిటీ క్యాంపస్‌ల ఏర్పాటును పరిశీలించాలని ఆహ్వానించారు.




2లో


## ఇరాన్ నన్ను హత్య చేయాలని చూస్తోంది: ట్రంప్

- ఇరాన్ మొదటి టార్గెట్ తానేనన్న ట్రంప్
- 47 ఏళ్లుగా ఇరాన్ వైఖరి మారలేదన్న అమెరికా అధ్యక్షుడు
- ప్రస్తుత నాయకత్వం కాస్త హేతుబద్ధంగా ఉందని వ్యాఖ్య
- ఇరాన్‌పై మళ్లీ దాడులు చేస్తామని హెచ్చరిక
- చర్చలు జరిపి సమయం వృథా అని వ్యాఖ్య

## నాన్నా.. మీరే నా స్ఫూర్తి: జగన్

- తన తండ్రి జయంతి సందర్భంగా నివాళి అర్పించిన జగన్
- తన తండ్రి ఆశీస్సులే తన ధైర్యం అంటూ ట్వీట్
- మిస్ యూ నాన్నా అంటూ భావోద్వేగం


2లో




## ఈ ఉచిత పథకాలు ఎవరడిగారు?

- కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చట్టబద్ధతపై హైకోర్టు సందేహాలు
- శాసనసభ ఆమోదం లేకుండా ప్రజాధనం పంపిణీపై ప్రభుత్వానికి ప్రశ్నలు
- ఉద్యోగుల జీతాలు, బిల్లులు పెండింగ్‌లో ఉండగా ఉచితాలపై ఆగ్రహం
- నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

## నాన్నా.. మీరే నా స్ఫూర్తి: జగన్

దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద వైసీపీ అధినేత జగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. "మీరే నా స్ఫూర్తి.. మీ ఆశీస్సులే నా ధైర్యం.. మిస్ యూ నాన్నా" అంటూ జగన్ భావోద్వేగంతో కూడిన ట్వీట్ చేశారు. వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఫొటోలను పంచుకున్నారు. ఇడుపులపాయలో నిర్వహించిన వేడుకల్లో వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతితో పాటు పలువురు వైసీపీ సీనియర్ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిరుపేదల సంక్షేమం, ఉచిత విద్య, వైద్యం, ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా వైఎస్సార్ చేసిన సేవలను ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. ప్రజల హృదయాల్లో నిలిచిన నేతగా రాజన్న ఎప్పటికీ స్ఫూర్తిదాయకుడని వారు స్మరించుకున్నారు.

## హాస్టళ్లు, గురుకుల విద్యార్థులకు10 శాతం డైట్ ఛార్జీల పెంపు

ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసే ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రతిభావంతులైన ఇంటర్ విద్యార్థులకు పైలట్ ప్రాజెక్టు కింద ప్రత్యేక కోచింగ్ కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే సంక్షేమ విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణకు ప్రత్యేక వైద్య విభాగం ఏర్పాటు చేయాలని సూచించారు. పొగాకు కొనుగోళ్లపై కూడా సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన కిలోకు రూ.200 కనీస మద్దతు ధరకు తగ్గకుండా కొనుగోళ్లు జరపాలని కంపెనీలను ఆదేశించారు. ఇండెంట్ ఇచ్చి కొనుగోళ్లు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టొద్దని హెచ్చరించారు. టొబాకో బోర్డు పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, రైతుల నమ్మకాన్ని దెబ్బతీసే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అయితే అవసరానికి మించి పొగాకు సాగు కావడం, ఎగుమతులు తగ్గడం వల్లే ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని అధికారులు, కంపెనీల ప్రతినిధులు సీఎంకు వివరించారు.

## ఇరాన్ నన్ను హత్య చేయాలని చూస్తోంది

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ తనను హత్య చేసేందుకు కుట్ర పన్నే అవకాశం ఉందని, తాను వారి 'నంబర్-1 టార్గెట్'నని అన్నారు. అంకారాలో జరుగుతున్న నాటో సదస్సు సందర్భంగా మీడియాతో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్ నాయకత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. గత 47 ఏళ్లుగా ఇరాన్ అదే విధమైన వైఖరిని కొనసాగిస్తోందన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న నాయకత్వం గతంతో పోలిస్తే కొంత హేతుబద్ధంగా వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో కొనసాగుతున్న చర్చలు ఇక ప్రయోజనం లేవని ట్రంప్ స్పష్టం చేశారు. "ఈ రాత్రే ఇరాన్‌పై మళ్లీ తీవ్ర దాడులు చేస్తాం. వారు రోజూ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నారు" అని హెచ్చరించారు. కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చర్చలు కొనసాగించాలని చర్చల బృందం భావిస్తే కొనసాగించవచ్చని, కానీ వాటిపై తనకు నమ్మకం లేదన్నారు. మరోవైపు, అమెరికా బుధవారం జరిపిన వైమానిక దాడుల్లో తమ సైన్యానికి చెందిన ఎనిమిది మంది సైనికులు మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా వెల్లడించింది. దక్షిణ ఇరాన్‌లోని బందర్ అబ్బాస్, బుషెహర్ ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయని పేర్కొంది. అమెరికా ఏకపక్ష దాడులతో ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించిందని ఇరాన్ విదేశాంగ శాఖ ఆరోపించింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## వివరణ ఎందుకు ఇస్తా?: కొండా సురేఖ ఫిర్యాదుపై తీవ్రంగా స్పందించిన కడియం శ్రీహరి

తనకు చెందిన దేవాదాయ శాఖ అధికారులతో అధికారిక సమీక్ష నిర్వహించారంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కడియం శ్రీహరిని వివరణ కోరాలని... విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని ఆమె కోరారు. సురేఖ చేసిన ఫిర్యాదుపై కడియం శ్రీహరి తీవ్రంగా స్పందించారు. "నేను ఏ తప్పూ చేయలేదు. అలాంటప్పుడు ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం నాకు లేదు" అని ఆయన తేల్చిచెప్పారు. తాను ఎప్పుడూ ప్రోటోకాల్‌కు లోబడే పనిచేస్తానని స్పష్టం చేసిన కడియం... ఇదంతా కేవలం అవగాహన లోపం వల్లనే జరుగుతోందని అన్నారు. దేవాదాయ శాఖపై సమీక్ష నిర్వహించే హక్కు తనకు లేదనే విషయం ఒక ప్రజాప్రతినిధిగా తనకు తెలుసని కడియం శ్రీహరి అన్నారు. "నా నియోజకవర్గంలోని పలు ఆలయాల సమస్యల పరిష్కారం కోసం మాత్రమే సంబంధిత శాఖ కమిషనర్, అధికారులు, ఆలయ చైర్మన్లను కలిశాను. అక్కడ ఎలాంటి అధికారిక సమీక్ష నిర్వహించలేదు. కేవలం క్షేత్రస్థాయి సమస్యలను మాత్రమే వారి దృష్టికి తీసుకెళ్లాను" అని వివరించారు. దేవాదాయ శాఖలో నిధులు లేవని చెప్పడంతో... ఆలయాల అభివృద్ధికి సంబంధించిన ఎస్టిమేషన్‌లను (అంచనాలను) మాత్రమే కోరినట్లు వెల్లడించారు. ఈ వివాదంపై కొండా సురేఖను ఉద్దేశించి కడియం శ్రీహరి పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. "రాజకీయాల్లో కొందరు కొత్త అలవాట్లు నేర్చుకున్నారు. నిత్యం ఏదో ఒక కాంట్రవర్సీ క్రియేట్ చేస్తూ... వార్తల్లో ఉంటూ ప్రజల మధ్య బతకాలని చూస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. తన నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం తాను ఎవరినైనా కలుస్తానని... అవసరమైతే మంత్రులను, ముఖ్యమంత్రిని కూడా కలిసి నిధులు సాధించుకుంటానని స్పష్టం చేశారు.



## ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారత సాంస్కృతిక వారసత్వం

సంగతి తెలిసిందే. భారత్ తరపున ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) కీలకంగా వ్యవహరించే ఈ ఉమ్మడి సంరక్షణ ప్రాజెక్టు.. అలాగే ప్రంబనన్ ఆలయ సముదాయాన్ని మోదీ, సుబియంతో కలిసి సందర్శించడం వంటి పరిణామాలు భారత్--ఇండోనేసియా బంధానికి తిరుగులేని ఉదాహరణ అని నిపుణులు పేర్కొంటున్నారు. ఆలయ ప్రదేశంలో ఏఎస్ఐ పరిరక్షణ, పునరుద్ధరణ ప్రాజెక్ట్ ప్రారంభానికి గుర్తుగా ఒక ఫలకాన్ని వారిద్దరూ ఆవిష్కరించారు. తొలుత ప్రంబనన్ ఆలయానికి చేరుకున్న మోదీకి సంప్రదాయ స్వాగతం లభించింది. ఆలయ ప్రాంగణంలో కలియతిరుగుతూ ఇక్కడి విశేషాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ చరిత్రను వివరించారు. మోదీ, సుబియంతో పరస్పరం కరచాలనం చేసుకుని ఫొటోలకు పోజులిచ్చారు. ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మోదీ ప్రసంగించారు. ఆలయ సముదాయానికి సంబంధించిన ఉమ్మడి పరిరక్షణ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో భాగం కావడం తనకు దక్కిన గౌరవమని మోదీ పేర్కొన్నారు. మిత్రుడు, అధ్యక్షుడు సుబియంతోతో కలిసి ఈ ప్రదేశాన్ని సందర్శించడం వల్ల ఈ సందర్భం తనకు మరింత ప్రత్యేకంగా మారిందన్నారు. ఇండోనేసియా ప్రజలు ఈ గొప్ప వారసత్వాన్ని భక్తిభావంతో సంరక్షిస్తూ వస్తున్నారని ప్రశంసించారు. అందుకే ఇండోనేసియా ప్రజలకు,



ఇప్పటివరకు ఈ దేశాన్ని పాలించిన పాలకులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని వెల్లడించారు. ఆ ఆలయాన్ని సందర్శించిన క్షణం దైవత్వ భావనతో నిండిన క్షణం అని వ్యాఖ్యానించారు. భారత్--ఇండోనేసియా స్నేహాన్ని బలోపేతం చేయడం, ఉభయ దేశాల ప్రజల సంక్షేమం, శీఘ్ర అభివృద్ధి కోసం భగవంతుడిని ప్రార్థించానని మోదీ తెలిపారు. ప్రంబనన్ ఆలయ సముదాయంలో సంరక్షణ, పునరుద్ధరణ పనులు ప్రారంభిస్తున్న తరుణంలో, భారతీయ పర్యాటకులు కచ్చితంగా ఈ ప్రదేశాన్ని సందర్శిస్తారని విశ్వాసం ఉందన్నారు. "ప్రపంచంలోని సుదూర ప్రాంతాల్లో మనం ఎక్కడికి వెళ్లినా భారతదేశపు సాంస్కృతిక వారసత్వాన్ని చూడవచ్చు. ఆగ్నేయాసియాలో భారత వారసత్వానికి సంబంధించిన అతిపెద్ద గుర్తింపుల్లో ఆ ఆలయం కూడా ఒకటి. ఇక్కడ శివుడు, దుర్గాదేవి, గణేశుడి విగ్రహాలు ఉన్నాయి. శతాబ్దాలుగా ప్రజలు పూజలు చేస్తున్నారు. నేడు ప్రంబనన్ ఆలయాన్ని సందర్శించి, ప్రార్థనలు చేసే అదృష్టం నాకు దక్కడం సంతోషంగా ఉంది"అని మోదీ

ఇండోనేసియా అధ్యక్షుడితో కలిసి ఈ ప్రాజెక్టును ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందంటూ మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. "అద్భుతమైన ప్రంబనన్ దేవాలయం మన సాంస్కృతిక, ఆధ్యాత్మిక అనుబంధాలకు కాలాతీత చిహ్నంగా నిలుస్తుంది. ఇటువంటి వారసత్వాన్ని పరిరక్షించడం అంటే తరతరాలకు స్ఫూర్తినిచ్చే సంప్రదాయాలను కాపాడుకోవడమే. ఈ ప్రయత్నంలో ఇండోనేసియాతో భాగస్వామి కావడం భారత్‌కు దక్కిన అదృష్టం. గాఢమైన సాంస్కృతిక సంబంధాలున్న దేశాలుగా భారత్, ఇండోనేషియాలు ఉమ్మడి గతాన్ని స్మరించుకుంటూ, మరింత బలమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికి కలిసికట్టుగా పనిచేయడం కొనసాగిస్తాయి"అని మోదీ పేర్కొన్నారు. ప్రంబనన్ గుడి యోగ్యకార్తా నగరానికి ఈశాన్యంగా సుమారు 17 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీన్ని ఇండోనేసియాలో అతిపెద్ద హిందూ ఆలయంగా పరిగణిస్తారు. 9వ శతాబ్దంలో నిర్మించారు. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులకు అంకితం చేశారు. ఈ ఆలయ సముదాయం భారతదేశం, ఇండోనేసియాల మధ్య ఉన్న ఉమ్మడి నాగరికత, సాంస్కృతిక వారసత్వానికి శాశ్వత చిహ్నంగా నిలుస్తుందని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టంచేసింది.

## అహోబిలంలో పొలిటికల్ హైటెన్షన్

నంద్యాల జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం అహోబిలం వేదికగా రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అహోబిలం ఆలయ తలనీలాల వ్యవహారంలో ఆరోపణలు, సవాళ్లతో స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, వైసీపీ నేత గంగుల బ్రిజేంద్రరెడ్డి అలియాస్ నాని మధ్య పొలిటికల్ వార్ పీక్స్‌కు చేరింది. తలనీలాల కాంట్రాక్ట్ వ్యవహారంలో అఖిలప్రియకు భారీగా ముడుపులు అందుతున్నాయని, ఇటీవల అవి అందకపోవడంతోనే ఆమె తలనీలాల తరలింపును అడ్డుకున్నారంటూ గంగుల నాని సంచలన ఆరోపణలు చేశారు. గంగుల నాని చేసిన అవినీతి ఆరోపణలపై అఖిలప్రియ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలంటూ ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. "నీ దగ్గర నిజంగానే ఆధారాలు ఉంటే అహోబిలం రా. అక్కడే తేల్చుకుందాం. తలనీలాల వ్యవహారంలో నా ప్రమేయం ఉన్నట్లు రుజువైతే నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా" అంటూ సవాల్ విసిరారు. అన్నట్లుగానే అఖిలప్రియ తన అనుచరులతో కలిసి అహోబిలం చేరుకున్నారు. ఒకవేళ గంగుల నాని చర్చకు రాకపోతే, నేరుగా ఆయన ఇంటికే వెళ్లి నిలదీస్తానని స్పష్టం చేయడంతో ఉత్కంఠ మరింత పెరిగింది. మరోవైపు ఎమ్మెల్యే విసిరిన ఛాలెంజ్‌పై గంగుల నాని కూడా వెనక్కి తగ్గలేదు. తాను చేసిన ప్రతి ఆరోపణకూ కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. అఖిలప్రియకు ముడుపులు అందిన వ్యవహారానికి సంబంధించి తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని ఆయన క్లారిటీ ఇచ్చారు.

## 'మీరు ఇవ్వలేదు.. మేమే కొట్లాడి తెచ్చుకున్నాం'

తెలంగాణలో తాడిచెర్ల-2 కోల్ బ్లాక్ అంశం రాజకీయంగా వేడెక్కింది. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి వేలం లేకుండానే ఈ బొగ్గు గనిని సింగరేణికి కేటాయించిందన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గట్టి కౌంటర్ ఇచ్చారు. ఇది కొత్త కేటాయింపు కాదని, రాష్ట్ర ప్రభుత్వం పోరాడి అనుమతులు తెచ్చుకుందని పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడిన భట్టి విక్రమార్క.. తాడిచెర్ల-2 బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం సంతోషకరమేనని చెప్పారు. అయితే ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వాస్తవాలను దాస్తున్నారని ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తాడిచెర్ల-2 బొగ్గు గనిని 2013లో అప్పటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని భట్టి తెలిపారు. అలాంటప్పుడు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కొత్తగా కేటాయించింది ఏంటని ప్రశ్నించారు. బ్లాక్ కేటాయించినప్పటికీ మైనింగ్ లీజుకు అవసరమైన అనుమతులు మాత్రం ఇవ్వలేదని చెప్పారు. కొత్త చట్టం ప్రకారం తాడిచెర్ల-2ను సింగరేణికి ఇవ్వబోమని కేంద్రం చెప్పిందన్నారు. అయితే ఆ చట్టం అమల్లోకి రాకముందే ఈ బ్లాక్ సింగరేణికి కేటాయించిన విషయాన్ని తాము ప్రధాని, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పోరాడటంతో చివరకు అనుమతులు వచ్చాయని చెప్పారు. ఇప్పటికైనా అనుమతులు ఇచ్చినందుకు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణపై నిజంగా బీజేపీకి ప్రేమ ఉంటే సింగరేణి పరిధిలో ఉన్న అన్ని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని భట్టి డిమాండ్ చేశారు. అదే తెలంగాణ ప్రయోజనాలను కాపాడే నిర్ణయమవుతుందని అన్నారు.

## 3 నెలలు మంత్రి పదవి ఇస్తే కాళేశ్వరం నీళ్లు తెచ్చి చూపిస్తా

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. తనకు మూడు నెలల పాటు నీటిపారుదల శాఖ బాధ్యతలు అప్పగిస్తే, కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లను ఆన్ చేసి ఎల్లంపల్లికి నీటిని తరలిస్తానని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ఈ ప్రక్రియలో విఫలమైతే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సంచలన ప్రకటన చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టులో కాంగ్రెస్ నేతలు రూ.2,328 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం గతంలోనే అనుమతినిచ్చిందని, ఆ ఒప్పంద పత్రాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తాను చెబుతున్న విషయాలు అబద్ధమని తేలితే తన పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నదుల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ జలాశయాలను నింపడం లేదని, దేవాదుల పంపులను నడపడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. వరంగల్ జిల్లాలో 90 శాతం చెరువులు ఎండిపోవడం ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. నిపుణుల సలహాలు, కేంద్ర ప్రభుత్వ అనుమతులతోనే తాము కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించామని, ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని హరీశ్ రావు సమర్థించుకున్నారు. తమ ప్రభుత్వంపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని, దీనికి కేసీఆర్, హరీశ్ రావులే బాధ్యులని జ్యుడీషియల్ కమిషన్ నివేదిక ఇవ్వడం, అలాగే సీబీఐ విచారణకు డిమాండ్లు వస్తున్న నేపథ్యంలో హరీశ్ రావు ఈ విధంగా ఎదురుదాడికి దిగారు.

### తెలంగాణ-కెనడా భాగస్వామ్యానికి కొత్త ఊపు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నేతృత్వంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం కెనడా పర్యటనకు రావాలని క్రిస్ కూటర్ ఆహ్వానించారు. మూసీ పునరుజ్జీవం, హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల్లో కెనడా భాగస్వామ్య అవకాశాలపై కూడా చర్చలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు కెనడా అన్ని విధాలుగా సహకరిస్తుందని క్రిస్ కూటర్ హామీ ఇచ్చారు. తెలంగాణ--కెనడా మధ్య పారిశ్రామిక, ఆర్థిక సంబంధాలు మరింత బలపడుతున్నాయని పేర్కొంటూ, ఫిరాన్ టెక్నాలజీ గ్రూప్ హైదరాబాద్‌లో తయారీ యూనిట్ ఏర్పాటు నిర్ణయం, సీఐబీసీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ప్రారంభం వంటి పరిణామాలు రాష్ట్రంపై కెనడా సంస్థల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. అలాగే సీపీపీ ఇన్వెస్ట్‌మెంట్స్ సంస్థ హైదరాబాద్‌కు చెందిన కంట్రోల్‌ఎస్ డేటా సెంటర్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుని ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడికి ముందుకు రావడం కూడా అదే నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.

## ఈ ఉచిత పథకాలు ఎవరడిగారు?



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చట్టబద్ధతపై హైకోర్టు తీవ్ర సందేహాలను వ్యక్తం చేసింది. శాసనసభ ఆమోదం లేకుండా కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల (జీవోల) ద్వారా ఈ పథకాలను ఏ విధంగా అమలు చేస్తారని ప్రశ్నించింది. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ పథకాలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్ గోపాల్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ బుధవారం విచారించారు. చట్టసభ ఆమోదం లేకుండా ప్రజాధనాన్ని పంపిణీ చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 245, 246లకు విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఈ పథకాలకు సంబంధించి జారీ చేసిన 8 జీవోలను రద్దు చేయాలని కోరారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తి ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలపై కీలక వ్యాఖ్యలు చేశారు. "ఉద్యోగులకు జీతాలు ఆలస్యమవుతున్నాయి, కాంట్రాక్టర్ల బిల్లులు, భూసేకరణ పరిహారం వంటివి పెండింగ్‌లో ఉన్నాయి, నిధుల కోసం ప్రభుత్వ భూములను విక్రయిస్తున్నారు. మరోవైపు రాష్ట్రం అప్పుల్లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఉచిత పథకాలను ఎవరు అడిగారు?" అని కోర్టు ఘాటుగా ప్రశ్నించింది. ప్రభుత్వం వద్ద అదనపు నిధులు ఉంటే ఉచితాలు ఇవ్వవచ్చని, కానీ చెల్లింపుల విషయంలో ప్రభుత్వానికి సరైన ప్రాధాన్యత ఉండాలని హితవు పలికింది. 2014లో ప్రారంభమైన ఈ పథకాల కింద ఇప్పటివరకు రూ.13,484 కోట్లు ఖర్చు చేశారని, కాగ్ నివేదికల ప్రకారం సుమారు రూ.90 కోట్లు అనర్హులకు అందాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ తరపున వాదనలు వినిపించిన అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్, నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేందుకే ఈ పథకాలు అమలు చేస్తున్నామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉందని తెలిపారు. ఇరుపక్షాల వాదనల అనంతరం, నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఆగస్టు 5కి వాయిదా వేసింది. అయితే, ఈ పథకాలపై తక్షణ స్టే ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాగునీటి సమస్య తీర్చాలి

**తొలివెలుగు, చౌటుప్పల్:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించి, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) చౌటుప్పల్ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ కు ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తిగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కళాశాలలో చదువుతున్న వందలాది మంది విద్యార్థులు స్వచ్ఛమైన తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న తాగునీటి ప్లాంటును వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. తాగునీటితో పాటు కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మరుగుదొడ్లు, పారిశుధ్యం తదితర మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు పోలేపల్లి మల్లేష్, జూనియర్ కళాశాల కార్యదర్శి సిద్దు, యశ్వంత్, వంశీ, సాయి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



- బంగారిగడ్డ స్కూల్‌ను పరిశీలించిన సీపీఎం బృందం
- పాఠశాలను పదో తరగతి వరకు పెంచాలని డిమాండ్
- సీపీఎం చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్

**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే నాణ్యమైన విద్యతో పాటు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన పాఠశాలల పర్యవేక్షణలో భాగంగా బుధవారం చౌటుప్పల్ బంగారిగడ్డలోని ప్రాథమిక పాఠశాలను ఆ పార్టీ నాయకులు సందర్శించారు. అక్కడ నెలకొన్న సమస్యలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కరుణాకర్ మాట్లాడుతూ.. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందని, వంటగది సరిగ్గా లేకపోవడంతో పాటు ఆడుకోవడానికి ఆట వస్తువులు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 1 నుంచి 8వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. బడులలో పరిశుభ్రమైన వాతావరణం, తాగునీరు, మరుగుదొడ్లు, నాణ్యమైన భోజనం కల్పించినప్పుడే పేద విద్యార్థులు ఇష్టంగా చదువుకోగలరన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ పాషా, బండారు నరసింహ, బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, తూర్పునూరి మల్లేశం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

- ఆయన పథకాలు నిరుపేదలకు వరం
- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగించి, ప్రజల హృదయాల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి శాశ్వతంగా నిలిచిపోయారని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పురపాలక కేంద్రంలో వైఎస్సార్ 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను తన విలక్షణ పరిపాలనతో వైఎస్సార్ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీఇంబర్స్‌మెంట్ వంటి విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టి నిరుపేదలకు ఉచితంగా విద్య, వైద్యాన్ని అందించిన మహోన్నత వ్యక్తి ఆయన అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మునుకుంట్ల నరేష్ గౌడ్, నాయకులు రేవల్లి యాదయ్య, బద్దం రాజేశ్వర్గౌడ్, మాజీ ఉపసర్పంచ్ పడాల సతీష్ చారి, వార్డు సభ్యుడు బైరు శివాజీ, కేసారం సురేందర్ రెడ్డి, శాపాక శంకర్, కళ్లెం సాయిలు, కోట సురేందర్, కోట బాలకృష్ణ, గుత్తి బాల శంకర్, గుండ్ల శ్రీరాములు, పాలకూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



# వైఎస్సార్ పథకాలు చిరస్మరణీయం



- చౌటుప్పల్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు
- వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు
- ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ పాలన ఆదర్శమని కొనియాడిన నేతలు

**తొలివెలుగు, చౌటుప్పల్:** దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి 77వ జయంతి వేడుకలను బుధవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ పాలన ప్రజా సంక్షేమానికి కొత్త దిశానిర్దేశం చేసిందన్నారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, పేదల అభ్యున్నతిని లక్ష్యంగా పెట్టుకుని అమలు చేసిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఇందిరమ్మ గృహాలు వంటి పథకాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని కొనియాడారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా వైఎస్సార్ పాలన సాగిందని, ఆయన ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మహానేతగా వైఎస్సార్ చిరస్థాయిగా గుర్తుండిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, చౌటుప్పల్ పురపాలక చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, సింగిల్ విండో వైస్ ఛైర్మన్ చెన్నగొని అంజయ్య గౌడ్, మాజీ మున్సిపాలిటీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, కౌన్సిలర్లు బద్రి గాలయ్య, కొసనం రాకేష్ రెడ్డి, పాక చిరంజీవి, పిల్లలమర్రి మధుసూదన్, బత్తుల వాణి విప్లవ్ కుమార్ గౌడ్, దేప రమ్య రాజు, సర్పంచులు భీమిడి ప్రదీప్ జీ, గంజి వనజ కృష్ణ, రిక్కల మహేందర్ రెడ్డి, పులనగారి నాగేశ్వరి అశ్విన్ కుమార్ గౌడ్, మర్రి వంశీధర్ రెడ్డి, గంగాపురం వసంత నగేష్, కరంటోతు రాజు, జువ్వి నరసింహ, సాతీరి శ్రీధర్ బాబు, కో-ఆప్షన్ మెంబర్లు బాబా షరీఫ్, ఎస్ కే జానీ బాబు, పస్తం గంగరాములు, మార్కెట్ డైరెక్టర్లు డిల్లీ చంద్రకళ, పబ్బు శ్రీకాంత్, ఎండీ గౌస్ ఖాన్, బోయ వెంకట్, కాటేపల్లి నవీన్, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయ చైర్మన్ బొబ్బిళ్ల మురళి, శ్రీ ఆందోళ్ మైసమ్మ దేవాలయ చైర్మన్ కంచర్ల అశ్విన్ రెడ్డి, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ దేప శ్యామ్ సుందర్ ముదిరాజ్, తొర్పునూరి నరసింహ, షాదిఖాన చైర్మన్ షేక్ కరీం, ఉపసర్పంచులు గడ్డం సత్యం, పులనగారి శ్రావణ్ కుమార్, పిన్నిటి శ్రీనివాస్ రెడ్డి, చిన్నకొండూరు మాజీ సర్పంచ్ బక్క స్వప్న శ్రీనాథ్, నాయకులు భక్తుల శ్రీహరి, కంది భూపాల్ రెడ్డి, మేకల దేవేందర్ రెడ్డి, బత్తుల భద్రం, లచ్చు నాయక్ మస్తాన్ బాబు, నీలు నాయక్, బక్క మల్లయ్య, ఆవుల యేసు, మాదని గోపాల్, సామకూర యాదయ్య, ఇప్ప వెంకటేష్, చాంద్ పాషా, ఎజాస్ పాషా, తగరం నాగరాజు, డిల్లీ శేఖర్ రెడ్డి, వివిధ గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలు

- రాజీవ్ స్మారక భవనంలో నివాళులర్పించిన ఎండీ ఖయ్యూం, ఐఎన్‌టీయూసీ నేతలు
- పేదల పెన్నిధి వైఎస్సార్ పాలన: కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 77వ జయంతి వేడుకలను బుధవారం చౌటుప్పల్ పట్టణంలోని రాజీవ్ స్మారక భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ స్మారక ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎండి ఖయ్యూం, కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్ లు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉమ్మడి రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీఇంబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో ఆయనను మహానేతగా నిలిపాయని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ రామ్ చందర్, రాజీవ్ స్మారక ట్రస్ట్ సలహాదారు నల్ల నరసింహ, చౌటుప్పల్ కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, ఓబీసీ మున్సిపల్ అధ్యక్షుడు ఆవుల యేసు యాదవ్, ఐఎన్‌టీయూసీ బ్లాక్ అధ్యక్షుడు కచ్చర్ల జగ్గయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాదాని గోపాల్, మాజీ షాదీఖానా



చైర్మన్ ఎండి అజాజ్, ఐఎన్‌టీయూసీ మండల ప్రధాన కార్యదర్శి చాంద్ పాషా, మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల గణేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు సుర్కంటి భగవత్ రెడ్డి, నిమ్మల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త ఓటర్ల నమోదుపై కాంగ్రెస్ శ్రేణుల అవగాహన

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశాలతో ప్రత్యేక కార్యక్రమం
- ఇంటింటికీ వెళ్లి ఓట్లు చేర్పించాలి: మహేందర్ గౌడ్

**తొలివెలుగు, రాజాపేట:** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా కాంగ్రెస్ శ్రేణులు చొరవ చూపాలని రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నమీల మహేందర్ గౌడ్ అన్నారు. ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్, డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలో కొత్త ఓటర్ల నమోదు, బీఎల్ఏ (బూత్ లెవెల్ ఏజెంట్)ల విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బూత్ పరిధిలో గతంలో ఉన్న ఓట్ల వివరాలను సరిచూసుకోవడంతో పాటు నూతన ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమర్థవంతమైన పర్యవేక్షణ కోసం ప్రతి 10 పోలింగ్ బూత్‌లకు ఒక కన్వీనర్‌ను నియమించి కోఆర్డినేషన్ చేయనున్నట్లు తెలిపారు. మాజీ



సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాజాపేట మండలంలో అత్యధికంగా ఓట్లను చేర్పించేలా నాయకులు గ్రామాల్లో పర్యటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, ఏఎంసీ, మండల, గ్రామ స్థాయి నాయకులు, యూత్ కాంగ్రెస్, అనుబంధ విభాగాల ప్రతినిధులు, మీడియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# రేషన్ దుకాణాల్లో ముక్కుతున్న దొడ్డు బియ్యం

- 18 నెలలుగా పట్టించుకోని పౌరసరఫరాల శాఖ
- రాజాపేట మండలంలో 500 క్వింటాళ్లకు పైగా నిల్వలు వృథా
- పురుగు పట్టి దుర్వాసన.. డీలర్ల అవస్థలు

**తొలివెలుగు, రాజాపేట:** మండలంలోని రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న సుమారు 500 క్వింటాళ్లకు పైగా దొడ్డు బియ్యం గడిచిన 18 నెలలుగా గోదాముల్లోనే మగ్గుతున్నాయి. ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాటి నుంచి అప్పటివరకు దుకాణాల్లో మిగిలిపోయిన దొడ్డు బియ్యం నిల్వలపై పౌరసరఫరాల శాఖ అధికారులు ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వలేదు. దీంతో ఈ బియ్యం కాస్తా పురుగు పట్టి, తుట్టెలు కట్టి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. మండలంలో మొత్తం 23 రేషన్ దుకాణాలు ఉండగా.. అందులో 15 పెద్ద దుకాణాలు, 8 చిన్న దుకాణాలు ఉన్నాయి. ప్రస్తుతం పెద్ద దుకాణాల్లో సగటున 30 క్వింటాళ్లు, చిన్న



దుకాణాల్లో 20 క్వింటాళ్ల చొప్పున దొడ్డు బియ్యం నిల్వలు మూలుగుతున్నట్లు తెలుస్తోంది. గత 18 నెలలుగా ఈ సమస్యపై రేషన్ డీలర్లు ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ఈ పురుగు పట్టిన బియ్యం వల్ల దుకాణాల్లో స్థల కొరత ఏర్పడటమే కాకుండా, ప్రస్తుతం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం బస్తాలకు సైతం ఈ పురుగులు



వ్యాపిస్తున్నాయని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాస ప్రాంతాల మధ్య ఉన్న రేషన్ దుకాణాల నుంచి వస్తున్న దుర్వాసనతో స్థానిక ప్రజలు సైతం అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ నిల్వల తొలగింపునకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..




# బాల కార్మికత్వ నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలి

**ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం చేయాలి: అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**వాణిజ్య సంస్థల్లో బోర్డులు తప్పనిసరి**



**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి :** జిల్లాలో బాల కార్మికత్వ నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి 'ఆపరేషన్ ముస్కాన్'ను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కర్ రావు ఆదేశించారు. జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో బుధవారం ఆపరేషన్ ముస్కాన్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ ద్వారా రక్షించిన బాలల వివరాలను సమీక్షించారు. ముస్కాన్ కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలన్నారు. జిల్లాలోని అన్ని వాణిజ్య సంస్థలు, హోటళ్లు, దుకాణాల యజమానులు "మా వద్ద 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో నియమించము" అనే నేమ్ బోర్డులను తప్పనిసరిగా ప్రదర్శించేలా కార్మిక శాఖ చర్యలు చేపట్టాలన్నారు. రక్షించబడిన బాలల సంరక్షణకు ప్రత్యేక షెల్టర్ హోమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ జయశ్రీ, డీఎంహెచ్ఓ డా. మనోహర్, డీఈఓ భిక్షపతి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజు, డీసీపీయు, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీనివాస పవర్‌లూమ్ సొసైటీ అధ్యక్షుడిగా రామకృష్ణయ్య

**- పాలకవర్గం ఏకగ్రీవ ఎన్నిక - నూతన ప్యానెల్‌ను సత్కరించిన పద్మశాలి సంఘం**



**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలోని శ్రీనివాస పవర్‌లూమ్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా ఆడెపు రామకృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియ వివరాలను ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటించారు. సొసైటీలోని మొత్తం 9 డైరెక్టర్ స్థానాలకు గాను 12 మంది నామినేషన్లు దాఖలు చేయగా, ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో మిగిలిన 9 మంది డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారి వెల్లడించారు. అనంతరం జరిగిన అంతర్గత ఎన్నికల్లో సొసైటీ అధ్యక్షుడిగా ఆడెపు రామకృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా ఆడెపు శ్రీశైలం, కార్యదర్శిగా సకినాల శ్రీనివాసులు, కోశాధికారిగా పొట్టబత్తిని నరహరి ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా గొట్టిపాముల సాయికృష్ణ, సకినాల ఉపేందర్, పొట్టబత్తిని నరేందర్, ఆడెపు రమాదేవి, కర్నాటి లక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజాపేట శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటరమణ, పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆడెపు శ్రీశైలం నూతన పాలకవర్గాన్ని శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. సొసైటీ బలోపేతానికి, నేత కార్మికుల సంక్షేమానికి తన శాయశక్తులా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు రామకృష్ణయ్య ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు మేళా కు సర్వం సిద్ధం.. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

చింతకాని మండలం జగన్నాథపురం మత్కెపల్లి క్రాస్ రోడ్ వద్ద జూలై 9న నిర్వహించే రైతు మేళా కు సర్వం సిద్ధం చేశామని, స్టాళ్లతో అధునిక వ్యవసాయ పద్ధతుల ప్రదర్శనలను రైతులు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపు నిచ్చారు. జూలై 10 మధ్యాహ్నం రెండు గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు చేరాయన్నారు. కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణ కోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తిచేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. బుధవారం అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి కార్యక్రమ ప్రాంగణాన్ని సందర్శించిన కలెక్టర్, రైతు మేళా స్టాళ్లు, ప్రధాన వేదిక, భోజనశాలలు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రజల రాకపోకల మార్గాలు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య ఏర్పాట్లు, వైద్య శిబిరాలు, విద్యుత్, సమాచార కేంద్రాలు తదితర ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి అంశం సమయానికి పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమ ప్రాంగణంలోని స్టాళ్లు, ప్రధాన వేదిక, భోజనశాలలు, పార్కింగ్ స్థలాలు, ప్రజల రాకపోకల మార్గాలు, పారిశుధ్య ఏర్పాట్లు, తాగునీటి వసతులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.

# సమాజ సేవలో పీసీఆర్ ఫౌండేషన్ సేవలు అమోఘం

- **పేదలకు అండగా.. విద్య, వైద్యం, క్రీడలు, ఆధ్యాత్మిక రంగాలకు చేయూత**
- **వేలాది కుటుంబాలకు ప్రత్యక్ష, పరోక్ష సహకారం**



**తొలివెలుగు, జన్నారం:** సమాజ సేవే పరమావధిగా రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పీసీఆర్ (పూర్ణచందర్‌రావు) ఫౌండేషన్ ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. అవసరంలో ఉన్న పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం నుంచి విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ, యువ క్రీడాకారులకు ప్రోత్సాహం, ఆలయాల నిర్మాణానికి సహకారం వరకు పలు రంగాల్లో ఫౌండేషన్ సేవలు కొనసాగుతున్నాయి. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసి ఉచితంగా మంచినీరు అందించడం, యువ క్రీడాకారులకు క్రీడా కిట్లు పంపిణీ చేయడం, పేద కుటుంబాల శుభకార్యాలకు ఆర్థిక చేయూత అందించడం వంటి కార్యక్రమాలను ఫౌండేషన్ చేపడుతోంది. అలాగే నూతన ఆలయాల నిర్మాణానికి విరాళాలు అందించడంతో పాటు వందలాది నిరుపేద కుటుంబాలకు అవసరమైన సమయంలో ఆర్థికంగా తోడ్పాటు అందిస్తోంది. ద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడం, దసరా, రంజాన్, క్రిస్మస్ వంటి పండుగల సందర్భంగా ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఫౌండేషన్ ప్రత్యేకతగా నిలుస్తోంది. ఏ కుటుంబానికైనా ఆపద వచ్చిన సమయంలో సాధ్యమైనంత మేర సహాయం అందిస్తూ వేలాది కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా భరోసాగా నిలుస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. పీసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పూర్ణచందర్‌రావు సమాజ సేవను తన బాధ్యతగా భావిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని అవసరమైన చోట సహాయ సహకారాలు అందిస్తున్నారని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. మానవ సేవే మాధవ సేవ అనే భావనతో నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న పీసీఆర్ ఫౌండేషన్ సేవలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



# అంగన్‌వాడీల్లో పారదర్శకత పెరగాలి

**- వంద శాతం సేవలు చేరడమే లక్ష్యం కావాలి**

**- సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆదేశం**





**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, అర్హులైన లబ్ధిదారులకు మరింత సమర్థవంతమైన సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ కార్యాలయంలో మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో అంగన్వాడీ సేవల అమలును మరింత బలోపేతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రాజెక్టు వారీగా సీడీపీఓలు, సూపర్వైజర్లు సమయపాలన పాటిస్తూ అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలని ఆదేశించారు. కేంద్రాల ద్వారా అందించాల్సిన అన్ని సేవలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి వంద శాతం చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రీ-స్కూల్ పిల్లలు ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాలకు హాజరయ్యేలా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని, కేంద్రాల నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. పోషణ ట్రాకర్, ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లలో లబ్ధిదారుల వివరాలు ఒకే విధంగా నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని, ఉపాధి హామీ పథకం (ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా మంజూరైన అంగన్వాడీ భవనాల నిర్మాణాలను ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సమన్వయం చేసుకుని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సీడీపీఓలు, సూపర్వైజర్లు తమ నెలవారీ టూర్ డైరీలను ప్రతి నెలా జిల్లా కార్యాలయానికి తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రజలకు సమర్థవంతంగా అందుతాయని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్, సీడీపీఓలు వెంకటరమణ, శైలజ, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, సూపర్వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి





- **ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి**
- **తుర్కపల్లిలో ఇందిరమ్మ ఇళ్లు, రోడ్లు, పాఠశాల నిర్మాణాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు**
- **నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి/తుర్కపల్లి:** పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, గ్రామ రహదారులు, పాఠశాల భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, గ్రామ రహదారి అభివృద్ధి పనులు, ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణాలను అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, లబ్ధిదారులకు నాణ్యమైన గృహాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ రహదారి నిర్మాణాలను వేగవంతం చేసి ప్రజలకు రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పాఠశాల భవనం, కమ్యూనిటీ శానిటరీ సదుపాయాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో జాప్యానికి తావు లేకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గీతారెడ్డి, హౌసింగ్ శాఖ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జన హృదయ నేతకు 'రామన్నపేట' జోహార్లు



- ఘనంగా మహానేత వైఎస్సార్ 77వ జయంతి వేడుకలు
- ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ
- వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం: పున్న జగన్మోహన్

**తొలివెలుగు, రామన్నపేట:** మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ?ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న జగన్మోహన్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం వైఎస్ రాజశేఖర రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. రైతుల సంక్షేమం, పేదల అభ్యున్నతి, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ఆయన అందించిన సేవలు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతాయని, ఆయన ఆశయ సాధనకు ప్రతి



కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరుద్దీన్, డీసీసీ కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టె సంతోష్ కుమార్, వనం చంద్రశేఖర్, సాల్వేర్ అశోక్, బొడ్డు సాలయ్య, మీర్జా బషీర్ బేగ్, జిల్లా వెంకటేశం, గుత్తా నర్సిరెడ్డి, రాయిని రమేష్, మొహమ్మద్ అక్రమ్, గోదాస్ శ్రీమన్నారాయణ, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బైరబోయిన శోభ, కాలేరు రేఖ, కాలేరు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో స్థిరమైన ఆదాయం





- ఉద్యానవన పంటలతోనే రైతులకు ఉజ్వల భవిష్యత్తు
- ఎకరానికి రూ.50 వేల రాయితీ: అధికారుల వెల్లడి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ఉద్యానవన పంటల సాగుతోనే రైతులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఉద్యానవన అధికారి మాధవి, ఆయిల్ ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని హైదర్‌పూర్ గ్రామంలో కాసారం లక్ష్మీనర్సిరెడ్డి (నల్గొండ గద్దర్) వ్యవసాయ క్షేత్రంలో వారు ఆయిల్ పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులకు ఏటా స్థిరమైన ఆదాయం లభిస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు రైతులకు భారీగా సబ్సిడీలను అందిస్తోందని తెలిపారు. తోటల యాజమాన్య ఖర్చులు, అంతర పంటల సాగు ప్రోత్సాహకంగా ఎకరానికి రూ.50 వేల వరకు రాయితీ లభిస్తుందని వివరించారు. ఈ మొక్కలను నాటిన నాలుగు సంవత్సరాల నుంచి దిగుబడి ప్రారంభమై, అనంతరం 30 ఏళ్ల పాటు నిరంతరాయంగా ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. సాంప్రదాయ పంటల కంటే లాభదాయకమైన ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శైలజ, ఫీల్డ్ ఆఫీసర్లు శిరీష, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# పోచంపల్లిలో జోరుగా చేనేత సంఘం ఎన్నికల ప్రచారం

- ఇంటింటికీ వెళ్తున్న అభ్యర్థులు.. ఓటర్ల మద్దతుకై అభ్యర్థన
- ఈనెల 10న పోలింగ్

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ఈనెల 10వ తేదీన జరగనున్న చేనేత సహకార సంఘం ఎన్నికల పర్వం ముగింపు దశకు చేరుకోవడంతో పురపాలక కేంద్రంలో బుధవారం అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కాంగ్రెస్ మద్దతు గల భారత లవ్‌కుమార్ ప్యానెల్ సభ్యులు రామ్‌నగర్ కాలనీలో విస్తృతంగా ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఓటర్లను కలుస్తూ తమ ప్యానెల్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో ప్యానెల్ సభ్యులు సూరపల్లి శ్రీనివాస్, సీత శ్రీశైలం, కోడి బిక్షపతి, సీత కృష్ణ, కర్నాటి ధనంజయ, చిలువేరు గోవర్ధన్, పాలాది జ్యోతి యాదగిరి, మహేశ్వరం నాగమణి తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, భారత వాసుదేవ్ ప్యానెల్ అభ్యర్థులు పట్టణంలోని వెంకటరమణ కాలనీ, సాయినగర్ కాలనీలలో జోరుగా ప్రచారం సాగించారు. చేనేత సంఘం అభివృద్ధికి తాము నిరంతరం శ్రమిస్తున్నామని, మరోసారి అవకాశం కల్పిస్తే మరింత ప్రగతికి కృషి చేస్తామని ఓటర్లకు హామీ ఇచ్చారు. ప్యానెల్ అభ్యర్థులందరినీ గెలిపించాలని వారు కోరారు. వీరితో పాటు ప్యానెల్ సభ్యులు గంజి అంజయ్య, భారత భారతమ్మ, పగడాల బుచ్చమ్మ, జోగు లక్ష్మీనారాయణ, భోగ బాల నరసింహ తదితరులు ఓటర్లను కలిసి మద్దతు కోరారు.





# నిరుపేద చేనేత కార్మికుడి కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ

- ఆదుకున్న బోధిధర్మ యోగ అండ్ హెల్త్ అసోసియేషన్
- మృతుడి కుటుంబానికి బియ్యం, సామగ్రి అందజేత

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** స్థానిక పురపాలక కేంద్రంలో ఇటీవల మృతి చెందిన నిరుపేద చేనేత కార్మికుడు గుంటి శ్రీనివాస్ కుటుంబాన్ని బోధిధర్మ యోగ అండ్ హెల్త్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం పరామర్శించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో శ్రీనివాస్ నివాసానికి వెళ్లిన సభ్యులు.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఆ కుటుంబానికి ఆసరాగా 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా చింతల రామకృష్ణ మాట్లాడుతూ.. సేవ, ఆరోగ్యం అనే ద్వివిధ లక్ష్యాలతో తమ అసోసియేషన్ అభ్యున్నతికి తోడ్పడుతోందన్నారు. అందులో భాగంగానే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న చేనేత కార్మికుడి కుటుంబాన్ని గుర్తించి తమ వంతు సాయం అందించామన్నారు. దాతలు స్పందించి ఈ నిరుపేద కుటుంబాన్ని మరింతగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు కొయ్యడ లింగస్వామి, కడివేరు చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి రుణం రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు దోర్నాల బాలరాజ్, విడం విష్ణు, కటిక ఐలయ్య, శీత జగదీష్, పెండెం భాను, వ్యవస్థాపక సభ్యులు కేమ విష్ణుమూర్తి, చింతకింది కిరణ్, సభ్యులు విడం రామనాథం, బిట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

- ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణుల నివాళి
- సంక్షేమ పథకాలు చిరస్మరణీయం: బత్తిని సహదేవ్ గౌడ్

**తొలివెలుగు, వలిగొండ:** ఎ మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్, పోలేపాక జానకిరాములు మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీఇంబర్స్‌మెంట్, ఇళ్ల నిర్మాణం వంటి విప్లవాత్మక పథకాలను అమలు చేసి ప్రజా హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ కుంభం వెంకట పాపి రెడ్డి, నాయకులు నూతి రమేష్ రాజ్, తుమ్మల యుగేందర్ రెడ్డి, పాశం సత్తి రెడ్డి, పబ్బు సురేందర్ గౌడ్, కాసుల వెంకన్న గౌడ్, ఎండీ ఖుర్షీద్, కొండూరు భాస్కర్ గౌడ్, ఎమ్మె మల్లేశం, మస్కు నర్సింహ, జక్క జంగారెడ్డి, చిలుగూరి సత్తి రెడ్డి, గోగికర్ వేణు, ఎమ్మె లింగస్వామి, కొండూరు సాయి, గోదా అచ్చయ్య, ఐటీపాముల పుష్ప, యూత్ కాంగ్రెస్ నాయకులు మైసోళ్ల ప్రవీణ్, బుగ్గ ఉదయ్, బత్తిని అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేట నూతన ఎస్ఐ సతీష్ గోపాతికి సత్కారం

- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా: ఎస్ఐ సతీష్ గోపాతి
- మర్యాదపూర్వకంగా కలిసిన కొమ్మాయిగూడెం గ్రామ నాయకులు



**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట పోలీస్ స్టేషన్ నూతన సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా బాధ్యతలు స్వీకరించిన సతీష్ గోపాతిని మండల పరిధిలోని కొమ్మాయిగూడెం గ్రామ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం వారు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐని కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా నిలవాలని, పూర్తి సహకారం అందించాలని కోరారు. దీనిపై ఎస్ఐ సతీష్ గోపాతి సానుకూలంగా స్పందిస్తూ.. ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా శాంతియుత మార్గాల్లో చట్టపరంగా పరిష్కరించుకునేందుకు పోలీసు శాఖ నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. మండల ప్రజలకు శాంతిభద్రతల పరిరక్షణలో తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మాయిగూడెం మాజీ ఉపసర్పంచ్ కూనూరు కృష్ణ గౌడ్, సీపీఐ నాయకుడు ఎర్ర రమేష్ గౌడ్, గౌడ సంఘం సొసైటీ అధ్యక్షుడు ఎర్ర వెంకటేష్ గౌడ్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బత్తుల సత్తయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్ర నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల భారం తాలలేక రైతు ఆత్మహత్య

- ఇస్కిల్లలో అప్పుల బాధతో యువ రైతు సురేష్ ఆత్మహత్య
- ఏడాది క్రితమే పుట్టింటికి భార్య, పిల్లలు.. మనోవేదనతో ఉరితాడుకు బలి
- కేసు నమోదు చేసిన రామన్నపేట పోలీసులు



**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండలంలోని ఇస్కిల్ల గ్రామంలో అప్పుల భారం, కుటుంబ పరిస్థితుల కారణంగా మనస్తాపానికి గురైన ఓ యువ రైతు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన చోటుచేసుకుంది. రామన్నపేట ఎస్ఐ జి. సతీష్ గోపాతి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మైల సురేష్ (32) తన సొంత ఎకరం భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. పంట సాగు కోసం యూనియన్ బ్యాంక్ మునిపంపుల శాఖ నుంచి రూ.5.5 లక్షల పంట రుణం తీసుకోవడంతో పాటు, వ్యక్తిగతంగా కూడా అప్పులు చేశాడు. అయితే ఆశించిన మేర పంట దిగుబడి రాకపోవడంతో అప్పులు తీర్చలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబంలో విభేదాలు తలెత్తడంతో సుమారు ఏడాది క్రితం అతని భార్య సరిత ముగ్గురు పిల్లలతో కలిసి తన పుట్టింటి గ్రామమైన మాంద్రకు వెళ్లిపోయింది. అప్పుల భారం, కుటుంబ పరిస్థితులతో తీవ్ర మనోవేదనకు గురైన సురేష్ మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పు రాడుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య మైల సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.



## హైదరాబాద్‌లో రూ.350 కోట్లతో లగ్జరీ హోటల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ హైదరాబాద్‌లో దాదాపు రూ. 350 కోట్లతో లగ్జరీ హోటల్‌ని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించింది. దీన్ని చాలెట్ హోటల్స్‌కి ప్రీ--లీజుకి ఇచ్చినట్లు తెలిపింది. 5.3 లక్షల చ.అ. విస్తీర్ణంలో ఉండే ఈ ప్రాజెక్టులో 330 గదులు ఉంటాయి. 2027--28 నాలుగో త్రైమాసికంలో ఇది పూర్తయ్యే అవకాశం ఉందని మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ తెలిపింది.ఇరు సంస్థల మధ్య ఒప్పందం ప్రకారం మైండ్‌స్పేస్ రీట్‌కి చెందిన స్పెషల్ పర్పస్ వెహికల్ సంస్థ సదరు ప్రాపర?టని స్థూలంగా నిర్మించి ఇస్తుంది. ఇంటీరియర్స్, హోటల్ నిర్వహణ మొదలైన పనులను చాలెట్ చేపడుతుంది. ప్రస్తుతం చాలెట్‌కి మొత్తం మీద 3,300 గదుల పోర్ట్‌ఫోలియో ఉంది. మైండ్‌స్పేస్ రీట్‌కి హైదరాబాద్‌తో పాటు ముంబై, పుణె చెన్నైలలో ఆఫీస్ అసెట్స్, బిజినెస్ పార్క్‌లు ఉన్నాయి.

## ఐటీ కొత్త రూల్: ఇంటి ఓనర్‌తో సంబంధం చెప్పాలి




ఆదాయపన్ను ముసాయిదా పత్రాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఇంటి అద్దెపై పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకునే వారు ఇకపై ఇంటి యజమానితో చేసుకున్న ఒప్పంద రుజువును చూపించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపన్ను చట్టం అమల్లోకి రానుండడం గమనార్హం. దీంతో ముసాయిదా పత్రాలు, నిబంధనలపై భాగస్వాములకు ఆదాయపన్ను శాఖ పంపిణీ చేసింది. వేతన జీవులు హెచ్ఆర్‌ఏ క్లెయిమ్‌ను చేసుకునే విషయంలో యాజమాన్యానికి ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఇకపై ఫారమ్ 124లో ప్రాపర్టీ యజమానితో ఉన్న సంబంధాన్ని (అసెసీ/పన్ను చెల్లింపుదారు/దాఖలుదారు) వెల్లడించాల్సి ఉంటుంది. కల్పిత, పెంచి చూపించే అద్దె మొత్తాలకు ఈ నిబంధన చెక్ పెడుతుందని పన్ను నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విదేశీ ఆదాయంపై పన్ను జమ క్లెయిమ్‌లకు సంబంధించి ఆడిటర్లు, కంపెనీలపై బాధ్యతను పెంచడం కూడా కొత్త పత్రాల్లో భాగంగా ఉంది. భారత్‌కు వెలుపల ఏదైనా ప్రాంతానికి సంబంధించిన ఆదాయంపై ఫారిన్ ట్యాక్స్ విత్‌హోల్డింగ్ సర్టిఫికెట్లను అకౌంటెంట్లు స్వతంత్రంగా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. చెల్లింపుల రుజువులు, కరెన్సీ మారకం లావాదేవీలు, పన్ను అర్హత నిబంధనలను, పన్ను చెల్లింపుదారు నివాస హోదాలను సైతం ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది.

## కొంచెం రిస్క్ ఉన్నా.. లాభం రావాలంటే?



ఈక్విటీలలో థీమ్యాటిక్/సెక్టోరల్ ఫండ్స్ అన్నవి కొంచెం రిస్క్ ఉన్నా సరే, రాబడులు కూడా బలంగా ఉండాలని కోరుకునే వారికి అనుకూలంగా ఉంటాయి. ఇవి తాము ఎంపిక చేసుకున్న రంగాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఈ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బిజినెస్ సైకిల్ ఫండ్ మాత్రం భిన్నమైన, మెరుగైన పనితీరుతో ఆకర్షిస్తోంది. ఇన్వెస్టర్లు దీర్ఘకాల లక్ష్యాల పెట్టుబడుల్లో కొంత మొత్తాన్ని వైవిధ్యం కోసం కేటాయించుకోవాలని భావించేట్టు అయితే.. ఈ ఫండ్‌ను పరిశీలించొచ్చు. పథకం 2021 జనవరిలో ప్రారంభమై.. ఐదేళ్ల ట్రాక్ రికార్డును పూర్తి చేసింది. ఈ పథకం ఆరంభంలో రూ.లక్ష ఇన్వెస్ట్ చేసి ఉంటే అది రూ.2.51లక్షలుగా మారి ఉండేది. ఐదేళ్లలోనూ ఏటా 20.56 శాతం చొప్పున ప్రతిఫలాన్ని అందించింది. ఇదే కాలంలో నిఫ్టీ 500 టీఆర్ఐ రాబడి 15.47 శాతమే ఉండడం గమనార్హం. ఏడాది కాలంలో పెట్టుబడులపై 18 శాతం రాబడిని అందించింది. ఇక మూడేళ్ల కాలంలో చూస్తే వార్షిక రాబడి 22.82 శాతంగా ఉంది. ఇక ఇదే విభాగంలో ఇతర పథకాలతో పోలి?చతే ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బిజినెస్ సైకిల్ ఫండ్ ట్రాక్ రికార్డు పటిష్టంగా ఉంది. ఇన్వెస్టర్లు కనీసం రూ.100 నుంచి సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఆరంభం నుంచి ఈ పథకంలో ప్రతి నెలా రూ.10,000 చొప్పున సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసి ఉంటే రూ.6.10 లక్షలు ఐదేళ్లలో రూ.9.74 లక్షలుగా మారి ఉండేది. అంటే ఏటా 18.47 కాంపౌండెడ్ రాబడి (సీఏజీఆర్)కి సమానం. బిజినెస్ సైకిల్స్ అంటే.. కొన్ని వ్యాపారాలకు ఒక్కో సమయంలో డిమాండ్ బలంగా ఉంటుంది. ప్రస్తుతం మెటల్స్‌లో బంగారం, వెండి, అల్యూమినియం, రాగి ధరలు గణనీయంగా పెరగడం, ఈ రంగాల్లోని కంపెనీలు బలంగా లాభాలు ఆర్జించడం చూస్తూనే ఉన్నాం. ఇలాంటి సైకిల్స్‌ను ఈ ఫండ్ ముందే గుర్తించి ఇన్వెస్ట్ చేస్తుంటుంది. స్థూల ఆర్థిక పరిస్థితులకు (ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు, వృద్ధి గమనం, ద్రవ్య పరిస్థితులు, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు) అనుగుణంగా ప్రయోజనం పొందే రంగాలను, థీమ్యాటిక్ అవకాశాలను ముందే గుర్తించి, ఆయా రంగాల్లోని బలమైన కంపెనీల్లో పెట్టుబడులు పెడుతుంది. తద్వారా దీర్ఘకాలంలో ఇన్వెస్టర్ల పెట్టుబడులను వృద్ధి చేయడం ఈ పథకం ఉద్దేశం. పరిస్థితులకు అనుగుణంగా విదేశీ స్టాక్స్‌లోనూ ఇన్వెస్ట్ చేస్తుంది.

# తగ్గిన దేశ వృద్ధిరేటు.. కొత్త సిరీస్‌లో జీడీపీ గణాంకాలు విడుదల

**అక్టోబర్–డిసెంబర్‌లో 7.8 శాతంగా నమోదు**

**అంతకుముందు త్రైమాసికంలో 8.4 శాతంగా రికార్డు**

**ఈ ఆర్థిక సంవత్సరం 7.6 శాతంగా అంచనా**




న్యూఢిల్లీ: దేశ జీడీపీ వృద్ధిరేటు తగ్గుముఖం పట్టింది. పాత సిరీస్‌ను కాదని, కొత్త సిరీస్‌ను తెచ్చి లెక్కించినా.. భారతీయ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న నిస్తేజాన్ని దాచలేకపోయింది నరేంద్ర మోదీ సర్కార్. ఈ ఆర్థిక సంవత్సరం (2025–26) మూడో త్రైమాసికం (అక్టోబర్–డిసెంబర్)లో ఆర్థిక ప్రగతి రేటు 7.8 శాతంగానే ఉన్నట్టు తేలింది మరి. అంతకుముందు త్రైమాసికం (జూలై–సెప్టెంబర్)తో పోల్చితే 0.6 శాతం పడిపోయింది. నాడు 8.4 శాతంగా ఉన్నది. శుక్రవారం కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ.. 2022–23 బేస్ ఇయర్ (ఆధారిత సంవత్సరం)తో నూతన వార్షిక, త్రైమాసిక జాతీయ పద్దు అంచనాల సిరీస్‌ను విడుదల చేసింది. ఇప్పటిదాకా ఉన్న 2011–12 బేస్ ఇయర్ జీడీపీ గణన సిరీస్ స్థానంలో దీన్ని తీసుకొచ్చింది. కాగా, జీడీపీ గణనకు బేస్ ఇయర్‌లను ఇలా సవరించడం ఇది తొమ్మిదోసారి.

**ఇదీ సంగతి..**

కొత్త సిరీస్‌తో దేశ జీడీపీ లెక్కింపు పద్ధతిని కేంద్రం సవరించింది. బేస్ ఇయర్‌ను మార్చడమేగాక, దేశంలోని ఆర్థిక కార్యకలాపాలన్నీ ప్రతిబింబించేలా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), ఈ–వాహన్ పోర్టల్‌ల డాటానూ జీడీపీ గణనకు అనుసంధానం చేశారు. ఇంతకుముందు జీఎస్టీ, ఈ–వాహన్ పోర్టల్ డాటా.. జీడీపీ లెక్కింపు పరిధిలోకి వచ్చేది కాదు. ఇదిలావుంటే కొత్త సిరీస్ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం జీడీపీ గణాంకాలను కేంద్రం సవరించింది. పాత సిరీస్ ప్రకారం 8.2 శాతంగా ఉంటే.. ఇప్పుడది 8.4 శాతానికి పెరిగింది. దీంతో చూస్తే.. అక్టోబర్–డిసెంబర్ జీడీపీ వృద్ధిరేటు 0.6 శాతం పడిపోయి 7.8 శాతానికే పరిమితమైంది. అయితే గత ఆర్థిక సంవత్సరం (2024–25) అక్టోబర్–డిసెంబర్‌తో పోల్చితే మాత్రం పెరిగింది. అప్పుడు 7.4 శాతంగా ఉన్నది. ఇక ఈసారి తయారీ, సేవా రంగాల్లో వృద్ధి కనిపించినట్టు కేంద్రం చెప్తున్నది.

**ఈసారి 7.6 శాతం**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ వృద్ధిరేటు 7.6 శాతంగా నమోదు కావచ్చని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. పాత సిరీస్‌లో ఈ అంచనా 7.4 శాతంగానే ఉన్నది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 7.1 శాతంగా నమోదైన సంగతి విదితమే. కాగా, జీడీపీ గణనలో బేస్ ఇయర్ మార్పుతో దేశంలోని ఆర్థిక కార్యకలాపాల అసలు విలువ మరింత స్పష్టంగా తెలుస్తుందని మోదీ సర్కార్ భావిస్తున్నది. అందుకే మొత్తం ఆర్థిక సంవత్సరం జీడీపీ అంచనాను పెంచింది. ఇక ఈ 2025–26లో దేశ జీడీపీ విలువ రూ.322.58 లక్షల కోట్లుగా ఉండొచ్చని అంచనా. 2024–25లో రూ.299.89 లక్షల కోట్లుగా ఉన్నట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ చెప్తున్నది.

వచ్చేసారి 7–7.4% : సీఈఏ

వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27) దేశ జీడీపీ వృద్ధిరేటు 7–7.4 శాతంగా ఉండొచ్చని ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ అంచనా వేశారు. అయితే గత నెల జనవరిలో కేంద్ర బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో మాత్రం ఈ అంచనా 6.8–7.2 శాతంగానే ఉన్నది. జీడీపీ గణనకు కొత్త సిరీస్ విడుదలైన నేపథ్యంలో ఇదిప్పుడు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. కాగా, దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం 4 లక్షల కోట్ల డాలర్ల మార్కును కూడా దాటగలదన్న విశ్వాసాన్ని కొత్త సిరీస్ ప్రకటన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వ్యక్తం చేశారు.

# జీసీసీలకు డిమాండ్ భళా



**గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలు/జీసీసీలు) ఏర్పాటుకు అమెరికా కంపెనీలు భారత్‌ను ఎంతో కీలకంగా చూస్తున్నాయి. గడిచిన ఐదేళ్లలో 2020 నుంచి 2025 మధ్య హైదరాబాద్ సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో.. 101 మిలియన్ చదరపు అడుగుల (ఎస్‌ఎఫ్‌టీ) కార్యాలయ వసతులను జీసీసీల ఏర్పాటుకు విదేశీ సంస్థలు లీజుకు తీసుకోవడం గమనార్హం. ఈ కాలంలో మొత్తం ఆఫీస్ లీజింగ్ 280.2 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీగా ఉన్నట్టు రియల్ ఎస్టేట్‌రంగ కన్సల్టెంట్ కొలియర్స్ ఇండియా తెలిపింది.**

బెంగళూరు, చెన్నై, ఢిల్లీ ఎన్‌సీఆర్, కోల్‌కతా, ముంబై, పుణె నగరాల డేటా ఆధారంగా ఒక నివేదికను విడుదల చేసింది. ఈ నగరాల్లో మొత్తం ఉపాధి డిమాండ్‌లో 36 శాతం జీసీసీల నుంచే వస్తున్నట్టు తెలిపింది. గత ఐదేళ్లలో 101 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీల జీసీసీల లీజింగ్‌లో 71 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీని అమెరికా కంపెనీలు తీసుకున్నాయి.'భారత ఆఫీస్ మార్కెట్ ఇటీవలి సంవత్సరాల్లో పెద్ద ఎత్తున విస్తరించింది. కరోనా అనంతరం డిమాండ్ ఎప్పటికప్పుడు గరిష్టాలకు చేరుతోంది. ముఖ్యంగా జీసీసీలు ఈ విస్తరణకు చోదకంగా ఉన్నాయి. వ్యయాలు ఆదా చేసుకునే కేంద్రాలుగా కాకుండా.. ఆవిష్కరణల ఆధారిత అంతర్జాతీయ అనుసంధాన విజ్ఞాన, పరిశోధన కేంద్రాలుగా అవతరించాయి' అని కొలియర్స్ ఇండియా తెలిపింది.

**ఏటా 35--40 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీ**

2025లో విదేశీ సంస్థలు భారత్‌లో 29.2 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీలను తీసుకునేందుకు ఒప్పందాలు కుదుర్చుకోవడం గమనార్హం. ఈ ఏడు నగరాల్లో స్థూల ఆఫీస్ లీజింగ్ 71.5 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీలో ఈ మొత్తం 41 శాతంగా ఉంది. విదేశీ సంస్థలు భారత్‌లో జీసీసీల ఏర్పాటుకు ఏటా 35--40 మిలియన్ ఎస్‌ఎఫ్‌టీని లీజుకు తీసుకుంటాయని కొలియర్స్ ఇండియా ఆఫీస్ సర?వసెస్ ఎండీ అరి?పత్ మెహరోత్రా అంచనా వేశారు. "యూఎస్ సంస్థల నుంచి టెక్నాలజీ ఆధారిత జీసీసీల ఏర్పాటు డిమాండ్ స్థిరపడొచ్చు. ఐరోపా సమాఖ్య, బ్రిటన్‌కు చెందిన సంస్థల నుంచి ఇంజనీరింగ్, తయారీ, బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్‌కు సంబంధించి జీసీసీల ఏర్పాటుకు డిమాండ్ పెరుగుతుంది"అని చెప్పారు.ఈ నివేదికపై భివ్ వర్క్‌స్పేస్ వ్యవస్థాపకుడు, సీఈవో సురేష్‌రావు పప్లికర్ స్పందిస్తూ.. భారత నైపుణ్యాలు, బిజినెస్ ఎకోసిస్టమ్ పట్ల అంతర్జాతీయ కంపెనీల్లో విశ్వాసానికి నిదర్శనమన్నారు. కోవర్కింగ్ సెంటర్లలో ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్‌ను జీసీసీల కోసం తీసుకోవడం పెరిగినట్టు చెప్పారు. భారత్‌పై దీర్ఘకాల దృష్టితో యూఎస్, యూరప్, బ్రిటన్ కంపెనీలు జీసీసీల ఏర్పాటుకు ఆఫీస్ వసతులను లీజుకు తీసుకోవడం పెరిగినట్టు 'స్పేస్‌వన్' ప్రాపర్టీ యాక్విజిషన్ విభాగం డైరెక్టర్ సిజోజోస్ తెలిపారు.



## వినియోగంలో లేని పీఎఫ్ ఖాతాల్లో డిపాజిట్ల రిఫండ్

వినియోగంలో లేని (ఇనాపరేటివ్) దాదాపు ఏడు లక్షల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఖాతాల్లోని సుమారు రూ.30.52 కోట్ల మొత్తాన్ని రిఫండ్ చేయడంపై ఈపీఎఫ్‌వో దృష్టి పెడుతోంది. సదరు ఖాతాదారులు లేదా వారి లీగల్ వారసులకు త్వరలో బదిలీ చేయనున్నట్లు కార్మిక శాఖ వర్గాలు తెలిపాయి. రూ.1,000 వరకు బ్యాలెన్స్ ఉన్న 7.11 లక్షల ఖాతాలను సెటిల్ చేయాలని కార్మిక, ఉపాధి శాఖ ఒక సమీక్షలో నిర్ణయం తీసుకున్నట్లు వివరించాయి. ఉద్యోగి లేదా కంపెనీ నుంచి 36 నెలలకు పైగా ఎలాంటి జమ లేని పీఎఫ్ ఖాతాలను ఇనాపరేటివ్‌గా పరిగణిస్తారు. సంబంధిత వర్గాల ప్రకారం 31.86 లక్షల ఇనాపరేటివ్ ఖాతాల్లో మొత్తం రూ. 10,903 కోట్లు ఉన్నాయి. వాటిలో రూ. 1,000 లేదా అంతకన్నా తక్కువ బ్యాలెన్స్ ఉన్న అకౌంట్లు ఏడు లక్షలు ఉన్నాయి. ఆధార్‌తో అనుసంధానమైన ఈపీఎఫ్ ఖాతాలున్న వారి బ్యాంకు ఖాతాలకు ఈ మొత్తాలను తక్షణం బదిలీ చేయనున్నారు.

### రిటైల్ రుణాలు రూ.162 లక్షల కోట్లు

రిటైల్ రుణాలు గణనీయమైన వృద్ధిని చూస్తున్నాయి. 2025 డిసెంబర్ త్రైమాసికంలో 18 శాతం పెరిగి రూ.162 లక్షల కోట్లకు చేరాయి. ముఖ్యంగా బంగారం ధరలు పెరగడంతో, వాటిపై రుణాలకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తుండడం.. అలాగే, పండగల సీజన్, జీఎస్‌టీ రేట్ల తగ్గింపు రుణ వితరణ పెరిగేందుకు దారితీసింది. ఈ వివరాలను క్రెడిట్ సమాచార సంస్థ క్రిఫ్ హై మార్క్ విడుదల చేసింది. రిటైల్ రుణాల్లో అతిపెద్ద విభాగమైన గృహ రుణాలు 10.5 శాతం పెరిగి రూ.43 లక్షల కోట్లకు చేరాయి. ఈ విభాగంలో యాక్టివ్ రుణాలు నికరంగా 3.3 లక్షలు పెరిగాయి. వ్యక్తిగత రుణాలు సైతం 11.6 శాతం వృద్ధితో రూ.15.9 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఆటో రుణాలు 14.6 శాతం, ద్విచక్ర వాహన రుణాలు 12.3 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ రుణాలు 14.3 శాతం చొప్పున పెరిగాయి. సోల్ ప్రొప్రైటర్ సంస్థలు (ఒక్కరే యజమానిగా ఉన్న) తీసుకున్న రుణాలు 26.2 శాతం పెరిగాయి. రిటైల్ రుణాల వసూలు కూడా మెరుగుపడింది. 30 నుంచి 180 రోజుల వరకు చెల్లింపుల్లేనివి (మొండి బకాయిలు) డిసెంబర్ చివరికి 2.8 శాతానికి తగ్గాయి.